క్లుప్తంగా

డివిజన్లలో పర్యటించిన ఎమ్మెల్యే పేర్ని నాని



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) బుధవారం పర్యటించారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి, 11వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గూడవల్లి నాగరాజుతో కలిసి పర్యటించారు. 17వ డివిజన్‌లో రామాలయం పునఃప్రతిష్ఠ, సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో జగనన్న సురక్ష శిబిరం



పెడన: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మీనాదేవితో పాటు అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సాయిప్రీతిలతో పాటు డాక్టర్ హరిరంగప్రసాద్, డాక్టర్ భూపాలాచారి రోగులను పరీక్షించారు. 415 మంది రోగులు ఓపీలో నమోదయ్యారు. డాక్టర్ల సూచనల మేరకు అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. సుగర్, బీపీలను పరీక్షించారు. మరికొందరికి ఈసీజీలు తీశారు. ఉచితంగా మందులు అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు




చల్లపల్లి: పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. స్థానిక ప్రధాన రహదారులపై బుధవారం సాయంత్రం సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్ఐ సీహెచ్ చినబాబు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలు, వాహనాల పార్కింగ్ తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తోపుడు బళ్ల వారు, చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

బీరువాలోని బంగారు నగలు, నగదు మాయం



పెడన: ఇంట్లో బీరువాలో దాచిన నగలు, నగదు మాయం కావడంపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని నాలుగో వార్డులో నివాసం ఉంటున్న రజియాసుల్తానా ఇంట్లోని బీరువాలో ఉండాల్సిన నగలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. రజియాసుల్తానా గృహిణి. భర్త ఎండీ నజీర్ అహ్మద్ ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మూడేళ్ల కిందట చనిపోయారు. అప్పటి నుంచి ఇంట్లో ఆమె ఒక్కతే ఒంటరిగా ఉంటోంది. ఐదు రోజుల క్రితం చూసినప్పుడు బీరువాలో నగలు, నగదు అలాగే ఉన్నాయి. తిరిగి మంగళవారం ఇంట్లోని బీరువా తెరిచి చూస్తే సుమారు రూ.6 లక్షల విలువ చేసే బంగారు నగలు, రూ.10వేలు నగదు కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేయగా, సీఐ కె.నాగేంద్రప్రసాద్ విచారణ చేపట్టారు.

పంటల రకాలపై అవగాహన



ఘంటసాల: గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల అగ్రికల్చర్ కాలేజ్ విద్యార్థినులు ఘంటసాల చరిత్ర, పంటల రకాలు తదితర అంశాలపై రైతులకు, గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఘంటసాల ప్రధాన రహదారులు, వనరులు, పంటలు, సమస్యలు, గ్రామ చరిత్ర టైమ్‌లైన్ తదితర ప్రదేశాలను రంగవల్లులతో తీర్చిదిద్ది ఏయే పంటలు అధికంగా పండుతాయి, రాబడి, రైతులు, సన్న చిన్నకారు రైతులు, కౌలు రైతులు, పాఠశాలలు తదితర అంశాలను తెలియపర్చేలా బొమ్మలు వేసి రైతులకు, గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు పి.యోహాను, వి.కోటేశ్వరరావు, బి.రాజేంద్ర, టి.పూర్ణచంద్రరావు, డాక్టర్ రాంబాబు, వీఏఏ రేవతి, అగ్రికల్చర్ విద్యార్థినులు కె.ప్రిస్కిల్ల, కె.షైనీ, ఆర్.శ్రావణి, ఎ.సుధర్షిణి, కె.స్వాతి పాల్గొన్నారు.

నాంచారమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు కట్టుదిట్టం

- వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం
- లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా
- జాతరలో కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టీకరణ



కృష్ణానది వద్ద ఘాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు చెప్పారు. ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే అమ్మవారి ప్రధాన తిరునాళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణం వద్ద బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమ్మవారి పుట్టింటివారిగా పిలవబడే గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల పాటు సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉండడంతో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలపై పలు ఆంక్షలు విధిస్తున్నట్లు అవనిగడ్డ సీఐ శ్రీనాథ్ తెలిపారు. 200 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని వి.కొత్తపాలెం మీదుగా వాహనాలు అనుమతించి, తిరుగు ప్రయాణం కోడూరు–కృష్ణాపురం మీదుగా పంపనున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ఘాట్ల ద్వారా పుణ్యస్నానాలు..

కృష్ణానది వద్ద రెండు ఘాట్ల ద్వారా భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు చెప్పారు. బారికేడింగ్‌తో పాటు ఐదు మరబోట్లు, 12మంది గజ ఈతగాళ్లతో గస్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. 40 మంది పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులను చేపట్టడంతో పాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను నిర్మిస్తామని ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. విశ్వనాథపల్లి స్పెషల్ పేరుతో అవనిగడ్డ నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సర్వీసును అవనిగడ్డ డిపో అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెప్పారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఈఓ సుధాకర్ తెలిపారు.

ఎన్నికల నియమావళికి లోబడే ..

పెదప్రోలు(మోపిదేవి): రానున్న ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల కోడ్ నియమావళిని అనుసరించి జాతర మహోత్సవాలు నిర్వహించుకోవాలని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ కమిటీకి తెలిపారు. మండల పరిధిలోని పెదప్రోలులో ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలపై ఆలయ కమిటీ, గ్రామ పెద్దలతో బుధవారం సాయంత్రం గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ సోమవారం నిర్వహించే నాంచారమ్మ అమ్మవారి జాతర నియమ, నిబంధనలకు లోబడి జరుపుకోవాలని సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వాటికి నిర్వాహకులే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకట్రామయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు కుర్రా గురుప్రసాద్, ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆదిరాంబాబు, నాదెళ్ల వెంకట్రామయ్య, ఎస్ఐలు వీరవెంకట సత్యనారాయణ, చిన్నబాబు, ప్రతాప్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రాజకీయాలకు తావు లేదు..

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జాతరలో రాజకీయాలకు తావు లేదని పోలీసులు స్పష్టం చేశారు. డీజేలకు అనుమతి లేదన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు నిషిద్ధమన్నారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించుకునే వారు రాజకీయాలకు సంబంధం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసులు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల నియమావళిని అనుసరించి కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. అనంతరం అధికారులు ఘాట్లను పరిశీలించారు. ఎస్ఐ శిరీష, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి కొప్పనాతి శేషుబాబు, పీఆర్ ఏఈ విజయకుమార్, ఆర్ఐ సుభాషిణి, ఈఓపీఆర్డీ నాగవేణి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీకి చెందిన 90 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పేర్ని కిట్టు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరినవారితో ఉప్పాల రాము

కోనేరుసెంటర్: బందరు మండలం సిరివెళ్ళపాలెం గ్రామంలోని 50 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారందరికీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో తమకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని, పార్టీ పరంగా గ్రామంలో తమ సేవలను ఉపయోగించుకుని చివరికి తమ కుటుంబాలను పట్టించుకోకుండా వదిలేసిన ఘనత తెలుగుదేశం పార్టీ నాయకులదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామస్తులందరితో పాటు పార్టీలకు అతీతంగా తమ కుటుంబాలకు కూడా ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. ఇళ్లు లేని ఎంతో మందికి గృహ సదుపాయం కలిగిందన్నారు. అనేక కుటుంబాలకు స్థలాలు లభించాయన్నారు. ఆ అభిమానంతోనే తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి పాటుపడతామని తెలిపారు. కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన అనేక పథకాలు ప్రవేశపెట్టి నిజాయితీగా అమలుపరిచారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీకి చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరినట్లు చెప్పారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపును ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడమర్రులో టీడీపీ నుంచి 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

కృత్తివెన్ను: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై నమ్మకంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి టీడీపీ నుంచి పెద్ద ఎత్తున చేరుతున్నారు. మండల పరిధిలోని నిడమర్రు పంచాయతీలో బుధవారం జరిగిన ప్రజాదీవెన కార్యక్రమంలో టీడీపీకి చెందిన సుమారు 40 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా రాము వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా తామంతా పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో రాముతోనే తమ ప్రయాణం కొనసాగుతుందని ముక్తకంఠంతో చెప్పారు. పార్టీలో చేరివారిలో లక్ష్మీపురం పల్లెపాలెంకు చెందిన రేవు నారాయణమూర్తి, రేవు సత్యనారాయణ, రేవు మధు, రేవు కృష్ణంరాజు, రేవు నాగరాజు, రేవు విజయ్, రేవు బాలాజీ, ఎస్.మధు, ఒర్లగొందితిప్పకు చెందిన జల్లా సురేష్, జల్లా శ్రీనివాసరావులతో పాటు పెద్ద సంఖ్యలో యువత ఉన్నారు.

దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



నాగాయలంక పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శనలో ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ నాయకులు

నాగాయలంక: మండల పరిధిలోని సంగమేశ్వరం గ్రామంలో ఈనెల 8వ తేదీన నాయుడు శివరామకృష్ణ అతని కుటుంబంపై జరిపిన దాడిలో నిందితులపై పోలీసులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపి ఎస్ఐ సుబ్రహ్మణ్యంను కలసి పలు అంశాలను విన్నవించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటనలో నిందితులు ఉద్దేశపూర్వకంగా చంపాలనే దాడి చేశారని, శివరామకృష్ణపై రాడ్లు, కర్రలు, బ్లేడ్‌లతో విచక్షణారహితంగా దాడి చేసిన అంశాన్ని మరోసారి ఎస్ఐ దృష్టికి తెచ్చామన్నారు. దీనిపై ఎస్ఐ స్పందిస్తూ మెడికల్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటానని, అవసరమైతే సెక్షన్ సవరిస్తామని చెప్పారన్నారు. అగ్నికుల క్షత్రియ ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర నాయకుడు ఒడుగు శ్రీకాంత్, వివిధ సంఘాలకు చెందిన కోలా బాలాజీ, తండు చార్లెస్, చెన్ను గురుమూర్తి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు బాధితుడు శివరామకృష్ణ, అతని తండ్రి సహదేవుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరాలి

- ఎస్ఎల్ఆర్ఎం ప్రోగ్రాం విజయవంతం కావాలి
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ శ్రీనివాసన్



ఎస్ఎల్ఆర్ఎం కార్యక్రమం వివరిస్తున్న శ్రీనివాసన్

చల్లపల్లి: చెత్తను పారేసే వృథా వస్తువుగా కాకుండా ఆదాయం ఇచ్చే సంపదగా మార్చినపుడే స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ వేలేరు శ్రీనివాసన్ అన్నారు. స్థానిక పద్మావతి హాస్పిటల్‌లో బుధవారం చల్లపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్ట్ సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంపై ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పంచాయతీ అధికారులకు, పాలకవర్గ సభ్యులకు అవగాహన కలిగించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, సుధాకర్, వేముల శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

తోట్లవల్లూరు: ఉపాధిహామీ కూలీల వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు కోరారు. తోట్లవల్లూరులో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతనంగా రోజుకు రూ.600 ఇవ్వాలని పేర్కొన్నారు.

ఏడింటిలోనూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి

- తండ్రి బాటలో నీతి నిజాయతీతో పనిచేస్తా
- మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు



అవనిగడ్డలో ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే సింహాద్రికి మద్దతు తెలుపుతున్న ఆటోవర్కర్స్ యూనియన్ నేతలు

అవనిగడ్డ: మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా తాను కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ బందరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో బుధవారం రాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖరరావు మాట్లాడుతూ తన తండ్రి రాజకీయాల్లో ఎంత మంచి పేరు తెచ్చుకున్నారో తాను కూడా అలాగే నీతి నిజాయతీతో పనిచేసి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా 70,825 కుటుంబాలకు రూ.1,623 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో పాటు పడ్డారని చెప్పారు. తాను కూడా ఇకపై ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ ప్రజాసేవ చేస్తానని వెల్లడించారు.

గతంలో కంటే భారీ మెజార్టీ ఖాయం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించనుందని తెలిపారు. పార్లమెంట్ స్థానానికి గతంలో కంటే భారీ మెజారిటీ రానుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశాయని, మరోసారి అవకాశం ఇస్తే ఇంతకంటే మంచి కార్యక్రమాలు అమలవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఆటోవర్కర్స్ యూనియన్ నేతలు, ఆటో డ్రైవర్లు చంద్రశేఖరరావును కలుసుకుని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా జగనన్న ప్రభుత్వం



కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్పలో చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

కృత్తివెన్ను: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచింది, నిలిచేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. మండల పరిధిలోని నిడమర్రు పంచాయతీ ఒర్లగొందితిప్ప, నిడమర్రు, పెదగొల్లపాలెం, నిడమర్రు దళిత వాడ గ్రామాల్లో బుధవారం జరిగిన ప్రజాదీవెన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి రాము పాల్గొన్నారు. ఇందులో భాగంగా వారిద్దరూ ప్రతి గృహాన్ని సందర్శిస్తూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, ఎస్సీ సెల్ కన్వీనర్ జాన్‌రత్నం, మైనార్టీ నాయకురాలు షేక్ బేగం, ఎంపీటీసీ పెద్దింట్లమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, స్థానిక నాయకులు రామచంద్రరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపురంలో కిట్టుకు అపూర్వ ఆదరణ



చిన్నాపురంలో పేర్ని కిట్టును ఆలింగనం చేసుకుని ఆశీర్వదిస్తున్న ఓ వృద్ధుడు

కోనేరుసెంటర్: మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గ్రామాల్లోకి అడుగుపెడుతున్న పేర్ని కిట్టుకు గ్రామస్తులు బ్రహ్మరథం పడుతున్నారు. అడుగడుక్కి హారతులు పట్టి ఆశీర్వదిస్తున్నారు. యువకులు ఎదురేగి జేజేలు పలుకుతూ ఘన స్వాగతం పలుకుతున్నారు. బుధవారం చిన్నాపురంలో గ్రామంలో రెండో రోజు జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న పేర్ని కిట్టుకి స్థానికులు పూలవర్షం కురిపిస్తూ గ్రామంలోకి తోడ్కొని వెళ్లారు. పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు కిట్టును ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని గ్రామంలోని ఇంటింటికీ తిప్పుతూ వచ్చే ఎన్నికలలో మన పేర్ని బిడ్డ కిట్టు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాడు అందరూ ఆదరించాలని, అండగా నిలవాలని గ్రామస్తులకు విజ్ఞప్తిచేశారు. గ్రామస్తులు కిట్టును విజయోస్తు అంటూ ఆశీర్వదించారు. పలువురు వృద్ధులు కిట్టు తలపై చేతులు పెట్టి విజయం నీదే బిడ్డా అంటూ దీవెనలు అందించారు. ఇదిలా ఉండగా కిట్టు ఇంటింటికీ తిరిగి సమస్యలపై ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట వాసు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా కోడూరు రహదారి నిర్మాణ పనులు

పనులు పరిశీలించిన ఆర్అండ్‌బీ అధికారులు



కాంట్రాక్టర్‌కు సూచనలిస్తున్న డీఈ వరలక్ష్మి

కోడూరు: కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ డీఈ వరలక్ష్మి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం రామచంద్రాపురం వరకు రహదారి లెవలింగ్ పనులు పూర్తి చేశారు. వి.కొత్తపాలెం–మాచవరం గ్రామాల మధ్య లెవలింగ్ పనులను భారీ యంత్రాల సహాయంతో నిర్వహిస్తున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించాలని డీఈ వరలక్ష్మి కాంట్రాక్టర్‌కు సూచించారు. పాత రహదారిని తొలగించి వెట్‌మిక్స్, జీఎస్‌బీ పోసి నిబంధనలకు అనుగుణంగా రోలింగ్, వాటరింగ్ చేయాలని ఆదేశించారు. జయపురం వద్ద రెండు చెరువులు ఉండడంతో ఈ ప్రాంతంలో రహదారి కుంగకుండా చర్యలు తీసుకోవాలని డీఈ సూచించారు. అనంతరం పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న విద్యార్థి. చిత్రంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి శంకర్‌నాథ్ తదితరులు

పెడన: రక్తదానం కొందరి ప్రాణాలను నిలుపుతుందని, ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ అన్నారు. స్థానిక విజయానంద డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించారు. ఈ సందర్భంగా శంకర్‌నాథ్ మాట్లాడుతూ రోగులకు సరైన సమయంలో రక్తం అందకపోవటం వల్ల ప్రాణాలను కోల్పోతున్న వారి సంఖ్య అధికమవుతుందన్నారు. ఈ విషయంలో విద్యార్థులు, యువత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యుడు డి.హనుమంతయ్య మాట్లాడుతూ రక్తదానం వల్ల గుండెపోటు ప్రమాదం తగ్గటంతో పాటు ఐరన్ స్థాయిలు అదుపులో ఉంటాయన్నారు. క్యాన్సర్ నివారణగా ఉండటంతో పాటు, బరువు తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగమల్లేశ్వరరావు, డైరెక్టర్ ఉమ్మిటి విద్యాధర్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జులు కేవీ రమణరావు, అబ్దుల్ బషీర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.